క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నూతనకల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో స్థిరపడే విధంగా నిరంతరం కృషి చేయాలని నాగార్జున నిడ్స్ ఒలింపియాడ్ హైస్కూల్ కరస్పాండెంట్ మారగాని వెంకన్నగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని నాగార్జున హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు గుర్రం యాదగిరిగౌడ్, రమేష్, సందీప్, రాజేశ్వరి, శ్రీలత, మాధవి పాల్గొన్నారు.

రైతులు ఎవరూ అధైర్య పడవద్దు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఈదురు గాలులు, వడగండ్ల వానకు నష్ట పోయిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దని సూర్యాపేట ఆర్డీఓ కె.రాజేందర్‌కుమార్ కోరారు. ఆదివారం తాటిపాముల గ్రామంలో వడగండ్ల వానతో ఇళ్లు కూలిపోయిన, పైకప్పులు లేచిపోయిన ఇళ్లను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించి జిల్లా అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం స్థానిక కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, యూత్, మహిళా, కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఆర్.కృష్ణయ్యకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి, నర్సింగ్ ఆఫీసర్ కల్పన ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి, తాము చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కృష్ణమాచారి, జయంతి, దీప, విజయలక్ష్మి, పూజ, లత తదితరులు పాల్గొన్నారు.

మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేయాలి

గరిడేపల్లి : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నందిపాటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పొనుగోడులో జరిగిన మాదిగ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత బహుజన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధానిలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేస్తే దళిత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. దళిత మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి, నాయకులు రమేష్, సత్యం, వెంకట్, నందిపాటి భిక్షం, వెంకన్న తదితరులు ఉన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలో శ్రీ కస్తూరి వెంకటేశ్వర కల్యాణ వేదికలో ఆదివారం శుభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని అర్చక సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ, ప్రధాన కార్యదర్శి అన్నపట్ల ఫణికుమార్‌శర్మలు పాల్గొని మాట్లాడారు. సమాజంలో అర్చకుల పాత్ర గొప్పదన్నారు. ప్రభుత్వం అర్చకులకు అందిస్తున్న గౌరవ వేతనాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వడగండ్లు.. కడగండ్లు



దురాజ్‌పల్లి : నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్

- పలు మండలాల్లో గాలివాన బీభత్సం
- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. చేతికి వచ్చిన వరి పంట నేల వాలింది. మామిడి కాయలు రాలిపోయాయి. వరి నేలబారి చిరు పొట్ట దశలోని పంట చేతికి అందకుండా పోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీనికి తోడు ఈదురు గాలులకు పలు గ్రామాలలో చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

దెబ్బతిన్న పంటలు :

మండలంలో సుమారు 6 వేలకు పైగా ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. దీంతో పాటు జలాల్‌పురం, మామిడాల, వెలిశాల, తొండ, బండ్లపల్లి, తాటిపాముల గ్రామాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కోతకు వచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలాయి. 100 ఎకరాలకు పైగా మిర్చి పంట దెబ్బ తిన్నది. మొక్క జొన్నతో పాటు టమాట, పచ్చి మిర్చి, కూరగాయలు, కొత్తిమీర, ఆకు కూరలు కూడా పలు గ్రామాల్లో దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు చాలా చోట్ల రేకుల షెడ్లు లేచిపోయాయి. తాటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట గది, క్లాస్‌రూంల రేకులు లేచిపోయాయి.

భారీ నష్టం వాటిల్లింది

వడగండ్ల వానకు మండలంలో పంటలకు భారీ నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ అన్నారు. ఆదివారం తిరుమలగిరి మండలంలోని జలాల్‌పురం, మామిడాల, వెలిశాల, మర్రికుంట తండాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరి 6 వేల ఎకరాలు, మామిడి 200 ఎకరాలు, మిర్చి 70 ఎకరాలు, మొక్కజొన్న 30 ఎకరాలలో దెబ్బ తిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్ దేవా తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: వడగళ్లతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌చార్జి ఈదురు వీరపాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ అకాలవర్షం, ఈదురు గాలులు, వడగళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రుణమాఫీ వెంటనే చేయాలని, ఎరువుల ధరను తగ్గించాలని కోరారు. ఆయన వెంట ఎంసీపీఐయూ నాయకులు సుధీర్, పెదనర్సయ్య, భిక్షం, వెంకన్న ఉన్నారు.

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అర్వపల్లిలో పోలీస్‌స్టేషన్‌రోడ్డులో నిర్మించిన వర్షపు నీటి కాల్వ అస్తవ్యస్థ నిర్మాణంతో వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఈ రూట్లో వర్షపు నీటి కోసం నిర్మించిన కాల్వ మట్టితో పూడిపోయి వర్షపు నీరు కాల్వ నుంచి ఇళ్లలోకి చేరుతుంది. తుఫాన్ మూలంగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పోలీస్‌స్టేషన్ రూట్లో పలు ఇళ్లలోకి నీళ్లు చేరి అవస్థలు పడ్డారు. హైవే అధికారులు ఇప్పటికైనా ఈ రూట్లో వర్షపు నీటి కాల్వల్లో పూడిక మట్టిని తొలగించి కాల్వలు సరిచేసి వర్షపు నీరు కాల్వల నుంచి సాఫీగా వెళ్లేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంటల పరిశీలించిన అధికారులు

తుంగతుర్తి: మండల పరిధిలోని రావులపల్లి, మానాపురం, గొట్టిపర్తి గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వడగండ్ల వర్షానికి మామిడి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న మామిడి, వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. దెబ్బతిన్న పంటల పూర్తిస్థాయి నివేదికను అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గొట్టిపర్తిలో దెబ్బతిన్న ఇళ్లు, కోళ్ల ఫారాలు, ధ్వంసమైన వరి, మామిడి, మొక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. మండలంలో వడగండ్ల వర్షానికి 7,355ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. రావులపల్లి, వెంపటి, గొట్టిపర్తి, మానాపురం గ్రామాల్లో 6,235 ఎకరాల్లో వరి, 920 ఎకరాల్లో మామిడి, 186 ఎకరాల్లో మిరప, 20 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టంవాటిల్లిందన్నారు. వీరివెంట ఏడీఏ జగ్గునాయక్, ఏఓ బాలక్రిష్ణ, హెచ్ఓ స్రవంతి, ఏఈఓలు తదితరులు ఉన్నారు.



365బీ హైవే వెంట పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఓ ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



జలాల్‌పురంలో వడగండ్ల వానకు నేలకొరిగిన వరి

రాళ్ల వానకు పూర్తిగా దెబ్బ తిన్నది



నాలుగున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. వడగండ్ల వానతో పంట మొత్తం పూర్తిగా దెబ్బతిన్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాళ్ల వాన కురవడంతో వడ్లు మొత్తం రాలిపోయాయి. అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలి.

– వెంకన్న గౌడ్, జలాల్‌పురం

కూరగాయల తోట మొత్తం దెబ్బ తిన్నది



ఇరవై గుంటల్లో టమాట, బెండ, కొత్తి మీర, పాలకూర సాగు చేశాను. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు మొత్తం నేల వాలిపోయాయి. మరో పది రోజులైతే పంట చేతికి వచ్చే దశలో భారీ వర్షానికి పూర్తిగా దెబ్బ తిన్నది. అధికారులు నష్ట పరిహారం అందించాలి.

– శ్రీనునాయక్, భోక్యానాయక్ తండా

రూ.50 వేల నష్టం వాటిల్లింది



శనివారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు చే తికి వచ్చిన మామిడి కాయలు మొత్తం నేల రాలాయి. భారీ ఈదురు గాలుకు చెట్టుకు ఒక్క కాయ లేకుండా రాలి పోయింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లింది. అధికారులు నష్ట పరిహారం అందించాలి.

– మల్లయ్య, తొండ

మిరప తోట మొత్తం నేల వాలింది



జలాల్‌పురం గ్రామ శివారులో ఎకరంన్నరలో మిరప సాగు చేశారు. వేల రూపాయలు పెట్టుబడి ఖర్చు చేశాను. చేతికి వచ్చే సమయంలో రాళ్ల వర్షానికి పంట పూర్తిగా దెబ్బతిన్నది. మిరపకు మంచి ధర వస్తుందనుకుంటే మొత్తం నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గొడుగు రామస్వామి, జలాల్‌పురం

వరి చేను మొత్తం దెబ్బతిన్నది



నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. శనివారం రాత్రి రాళ్ల వాన కురవడంతో పొట్టకు వచ్చిన వరి మొత్తం దెబ్బతిని నేలకు ఒరిగింది. నాలుగు ఎకరాలు పూర్తిగా కింద వాలిపోయింది. ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి పెట్టాను. ఈసారి ఖర్చులు కూడా రాలేని పరిస్థితి నెలకొంది.

– వాలియా, రైతు, వెలిశాల

మోదీని నిలువరించే నాయకుడు కేసీఆర్

- మంత్రి జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: దుర్మార్గాలకు పాల్పడుతున్న మోదీని నిలువరించే నాయకుడు, దేశాన్ని రక్షించగల నాయకుడు కేసీఆర్ మాత్రమే అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే శ్రీరామరక్ష అని ఆత్మీయ సమ్మేళనాలు.. నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో పార్టీని మరింతబలోపేతం చేసి పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపి మరింత చైతన్య పరిచేందుకు పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజు రోజుకూ శృతిమించుతున్న బీజేపీ దుర్మార్గాలను ఎండగట్టి ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని అందుకు కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చి చిచ్చు పెట్టాలని ప్రయత్నాలు చేసేందుకు కొందరు వస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, వై. వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ పాల్గొన్నారు

నేడు అక్షర ఉగాది వేడుకలు

సూర్యాపేట రూరల్ : అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో నక్షత్ర హాస్పిటల్స్ హైదరాబాద్, జేఎస్ ఆర్ సన్ సిటీ గ్రూప్ హైదరాబాద్, స్వశోధన్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో సోమవారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్ హాల్లో అక్షర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మధ్యాహ్నం కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, సాయంత్రం సూర్యాపేట జిల్లాకు చెందిన అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామాల్లోని వృత్తుల వారు, కళాకారులు, సామాజిక రంగాల్లో నిష్టాతులైన, విశేష సేవలు అందిస్తున్నవారికి అక్షర పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఉప్పు నాగయ్య, బత్తుల దామోదర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, తుంగతుర్తి జనార్దనాచారి, వీరాసింగ్, హనుమాచారి, అనుముల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



సూర్యక్షేత్రంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్ స్వామి

అర్వపల్లి : హిందూ ధర్మ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని తిరుపతికి చెందిన హిందూ ధర్మ ప్రచారకుడు శ్రీ రాధామనోహర్‌దాసు స్వామి కోరారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఆదివారం తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సందర్శించి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా



కంచుగట్లగూడెంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : కంటి వెలుగు కార్యక్రమంతో పాటు ప్రభుత్వ పథకాలపై ఆదివారం మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆవాసం కంచుగట్లగూడెంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆట–పాట, మాటల ద్వారా కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. 18ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా అద్దాలు, మందులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సారధి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నెల నాగరాజు, ఉదయ్, శ్రీకాంత్, రాములు, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్: మండల పరిధిలోని భాగ్యతండా గ్రామానికి చెందిన ధరావత్ జగ్రు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీటీసీ గద్దల నాగరాజు, గోదల రంగారెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, యాట ఉపేందర్, వల్దాసు దేవేందర్, స్వామి నాయుడు, ధర్మా నాయక్ తదితరులు ఉన్నారు.



జగ్రు కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వందిష్టిబొమ్మ దహనం



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు



తిరుమలగిరిలో మంత్రి దిష్టి బొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్లు లీకైన ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. ఈమేరకు పీసీసీ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిట్ విచారణను నిర్వీర్యం చేసే విధంగా కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఒక పక్క సిట్ దర్యాప్తు జరుగుతుంటే, ఈ ఘటనలో కేవలం ఇద్దరి ప్రమేయం మాత్రమే ఉందని కేటీఆర్ చెప్పడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, టీపీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు శైలేందర్, సేవాదళ్ జిల్లా చీఫ్ ఆలేటి మాణిక్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, కుమ్మరికుంట్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీకేజీని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని సూర్యాపేట–ఖమ్మం రహదారిపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దిష్టి బొమ్మనును దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం కేసీఆర్ వెంటనే రాజీ నామా చేయాలని, కేటీఆర్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ధరావతు వీరన్న నాయక్, పఠాన్ సమీర్, లాలు నాయక్, చాంద్ పాష, వెంకన్న, వీరబోయిన సైదులు, లక్ష్మణ్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, పత్తిపాక వేణుదర్, చందు, మీరా, గౌతమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : టీఎస్‌పీఎస్‌సీలో పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వై.నరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, ఎం.డి.హఫీజ్, విశ్వేశ్వర్, రాజు, వీరేష్, రామోజి, ప్రేమ్‌ప్రసాద్, అశోక్, మల్లేష్, లింగన్న, మల్లారెడ్డి, వెంకన్న, దయాకర్, సుధాకర్, ఉపేందర్, నరేష్, రషీద్ పాల్గొన్నారు.

అర్వపల్లి : టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీని నిరసిస్తూ దీనికి మంత్రి కేటీఆర్ బాధ్యుడని పేర్కొంటూ టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం అర్వపల్లిలో వై జంక్షన్ నందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, ఆర్. రమేష్, పెద్దబ్రహ్మం, నల్లగుంట్ల రవి, ఎ. నరేష్, నోముల నరేష్, విక్రం, ఎం. నాగరాజు, సత్యనారాయణ, నిరంజన్, పాల్గొన్నారు.

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. టీఎస్‌పీఎస్సీ టౌన్ ప్లానింగ్, గ్రూప్–1 పేపర్ లీకేజీని ఖండిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.అనంతరం వారు మాట్లాడారు. అనంతరం స్థానిక పోలిసులు నిరసన తెలియజేస్తున్న నాయకులను అరెస్ట్ చేసి పోలిసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొబ్బిలి వెంకన్న, పచ్చిపాల వెంకన్న, బర్పటి ఉపేందర్, ఉబ్బని రఘుపతి, పాక అమృత మల్లు, సోమేశ్వరావు, మాముసూరి ఉపేందర్, రేసు లింగయ్య, వినోద్, సాయి, ఎల్లేష్, ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకన్న, అనోక్, ప్రవీణ్‌రెడ్డి, మహేందర్, గంగయ్య, ఉప్పుల రాంబాబు, ఉప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

నాగారం : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను లీక్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.వలీ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ఫరీద్, బుడెన్, హుస్సేన్, సయ్యద్, జానీ, అక్బర్‌పాష, బాజీ, సురేష్, ఆదిల్ తదితరులు ఉన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలి



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నాగారంలో..



నూతనకల్ నుంచి రాయినిగూడెం తరలివెళ్తున్న సీపీఎం నాయకులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో వైద్య పరీక్షలు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అని సీపీఎం మండల కమిటీ సభ్యుడు సానబోయిన ఉపేందర్ అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వరాజ్యం ఆశయ సాధనకు నేటి యువత అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సూర్యాపేటలో జరిగిన స్వరాజ్యం వర్ధంతి సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు తొండల నారాయణ, బెల్లంకొండ ఇస్తారి, నాయకులు రాంమల్లు, మలయ్య, వెంకటయ్య, యువజన సంఘం నాయకులు ఎరుకల నాగరాజు, బెల్లంకొండ రవి, శేషగిరి మలయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా పోరాడిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మలయ్య, కడెం లింగయ్య, పత్తేపురం యాదగిరి, కడారి లింగయ్య, ఎల్లంల యాదగిరి, తన్నీరు రాంప్రభు, శంకరయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెంలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాయినిగూడెంలో జరిగే సభకు ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, నాయకులు వజ్జె సైదయ్య, వజ్జె వినయ్‌యాదవ్, పనస భద్రయ్య పాల్గొన్నారు.

నాగారం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ శాసన సభ్యురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం నాయకులు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరకొండ యాదగిరి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 13 ఏళ్ల వయస్సులోనే తుపాకీ పట్టి తన సోదరుడైన భీంరెడ్డి నర్సింహారెడ్డితో ఈ ప్రాంత ప్రజల విముక్తి కోసం పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు దేవరకొండ మల్లమ్మ, మహిళలు వెంకటమ్మ, రేణుక, సృజన, పీరమ్మ, సైదమ్మ, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం మండల పరిధిలోని రాయినిగూడెంలో నిర్వహించిన ప్రథమ వర్ధంతి సభకు మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామం నుండి సీపీఎం కార్యకర్తలు ఆదివారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బొజ్జ శ్రీనివాస్, పోలెపాక నగేష్, బత్తుల సోమయ్య, పంతం నగేష్, అబ్బుమ్మ, బక్కుల మంగయ్య తదితరులు ఉన్నారు.

కొత్తగూడెంలో ఉచిత వైద్యశిబిరం

తుంగతుర్తి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని కొత్తగూడెంలో అంకితం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యశోద హాస్పిటల్ మేనేజ్మెంట్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం కూమార్తె పాదూరి కరుణ మాట్లాడుతూ నాడు భూమికోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని కొనియడారు. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మల్లు సుధీర్‌రెడ్డి, డాక్టర్ గౌతంరెడ్డి, కపోత్తంరెడ్డి, భీంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దాచెపల్లి సింగారెడ్డి, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, సర్పంచ్ నకిరేకంటి విజయ్, సింహాద్రి, లచ్చయ్య, యాదయ్య, డాక్టర్లు రోజీ, శివాని, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

నడిగూడెం : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆయన స్వగ్రామం అయిన కరివిరాలలో బంగారు మైసమ్మ పండుగ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ బాణాల కవిత, ఎంపీటీసీ రణబోతు రమాదేవి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పుల్లయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.



కరివిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కోరం పూర్తికానందున సోమవారానికి వాయిదా వేసినట్లు ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శాంతకుమారితో కలిసి ఎంపీపీ మాట్లాడారు. తదుపరి సమావేశం నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.